కేడీసీలో 'క్యాంటీన్' లొల్లి

- తాళం వేసిన పీడీ
- పోలీసులకు ఫిర్యాదు చేసిన నిర్వాహకురాలు

హనుమకొండ చౌరస్తా, జూన్ 25 : కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో క్యాంటీన్ కోసం గొడవ జరుగుతోంది. కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ సోమయ్య తమను దుర్భాషలాడుతూ అగౌరపరిచాడని క్యాంటీన్ నిర్వాహకురాలు బూర్గుల ప్రమద హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. కేడీసీలో యాజమాన్యం అనుమతితో మార్చి 25న క్యాంటీన్ ప్రారంభించినట్లు ప్రమద తెలిపారు. అయితే, టెండర్ వేయాలని, అప్పటివరకు క్యాంటీన్ నడపవద్దని ఈ నెల 12న క్యాంటీన్‌కు పీడీ తాళం వేసి సీల్ వేశారని ఆరోపించారు. తాము వేసిన తాళాన్ని కూడా పగులగొట్టారని తెలిపారు. క్యాంటీన్‌లో వంట సామగ్రి, ఫర్నిచర్, ఫ్యాన్లు ఏర్పాటు చేసుకుని మూడేళ్లుగా నిర్వహిస్తుంటే అకారణంగా తమను క్యాంటీన్ నుంచి వెళ్లగొట్టి పీడీ తాళం వేశాడని అన్నారు. తన దగ్గర పనిచేస్తున్న మరొకరికి క్యాంటిన్‌ను అప్పజెప్పాలని ప్రిన్సిపాల్, పీడీ చూస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ విషయమై కేడీసీ ఫిజికల్ డైరెక్టర్ సోమన్నను వివరణ కోరగా ప్రిన్సిపాల్ ఆదేశాల మేరకే క్యాంటీన్‌కు తాళం వేశానని, ఎవరినీ దుర్భాషలాడలేదని చెప్పారు. కాగా, ప్రిన్సిపాల్ రాజారెడ్డిని వివరణ కోరగా మూడేళ్ల క్రితం కాలేజీ న్యాక్ పాయింట్ల కోసం క్యాంటీన్ ఉండాలంటే తెలిసిన వ్యక్తి ద్వారా బూర్గుల ప్రమదకు క్యాంటిన్ ఇచ్చామని తెలిపారు. అయితే, ఆమె చాయ్ బాగా చేయడం లేదని, ఆమె దగ్గర పనిచేస్తున్న మహిళ బాగా చేస్తుండడంతో క్యాంటిన్‌ను ఆమెకు ఇచ్చామని చెప్పారు. ఇప్పుడు ప్రమద తనకే క్యాంటీన్ ఇవ్వాలని లొల్లి చేస్తుందని, అందుకే తాళం వేయించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఇద్దరికీ క్యాంటీన్ ఇవ్వకుండా మొత్తానికే మూసి వేస్తున్నట్లు ఆయన వివరించారు.

రైల్వే ఉద్యోగోన్నతుల్లో రిజర్వేషన్‌కు కృషి

కార్మికనాయకులను సన్మానిస్తున్న రైల్వే ఎస్సీ, ఎస్టీ నాయకులు

కాజీపేట, జూన్ 25 : దక్షిణ మధ్య రైల్వేలో వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సీ, ఎస్టీ కార్మికుల ఉద్యోగోన్నతుల్లో రిజర్వేషన్ అమలయ్యేలా కృషి చేస్తామని ఆల్ ఇండియా రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వీరన్న, రాజశేఖర్ అన్నారు. కాజీపేటలో అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు ముఖ్యఅతిథులుగా మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ కార్మికుల ఉద్యోగోన్నతుల్లో సుప్రీంకోర్టు గైడ్‌లైన్‌ల ను పాటించడం లేదని ఆరోపించారు. ఉద్యోగోన్నతుల్లో రిజర్వేషన్‌ను అమలు చేయకుంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కేఎన్ రావు, ఎస్సీ, ఎస్టీ నేతలు దేవేందర్, శ్రీనివాస్, సంపత్‌కుమార్, శ్రీనుబాబు, కుమారస్వామి, వీరస్వామి, కిషన్, నరేశ్, జక్రయ్య పాల్గొన్నారు.

నేత్ర, అవయవ దానంపై అవగాహన

శరీర దానానికి ముందుకు వచ్చిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న సదాశయ ఫౌండేషన్ సభ్యులు

హనుమకొండ, జూన్ 25 : సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ ఆద్వర్యంలో మంగళవారం నగరంలోని మీనాక్షి ఫంక్షన్‌హాల్‌లో శరీరదాత తిరుకోవళూరు శ్రీలక్ష్మి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి బంధుమిత్రులకు నేత్ర, అవయవ దానాలపై అవగాహన కల్పించారు. ఫౌండేషన్ సలహాదారుడు రాజేంద్రకుమార్ సదాశయ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల గురించి వివరించారు. శ్రీలేఖ సాహితీ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీరంగస్వామి ఉన్నతాచార కుటుంబంలో జన్మించిన కుల, మతాలకతీతంగా, సమాజహితమే ధ్యేయంగా 2020లో తన తల్లి తాయమ్మ దేహాన్ని దానం చేశారని, ఇప్పుడు భార్య శ్రీలక్ష్మి దేహదానం చేసి సంఘానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో ప్రముఖ కవయిత్రి అనిశెట్టి రజితాదేవి, పింగళి కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ శ్యామల, విశ్రాంత ఇంజినీర్ నందకిశోర్ సైతం శరీర దానానికి ముందుకు వచ్చి పత్రాలపై సంతకాలు చేసి, ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ బన్న అయిలయ్య, ప్రొఫెసర్ రామారావు, గన్నమరాజు గిరిజామనోహరాచార్యులు, ప్రొఫెసర్ నిత్యానందరావు, పురోహితులు వెంకటేశ్వర స్వామి, మృదుల, డాక్టర్ పల్లె వీరస్వామి, డాక్టర్ ఎం నాగయ్య, ఎం బ్రహ్మచారి, డాక్టర్ బండారు సుజాత, పల్లె నాగేశ్వరరావు, శ్రవణ్ కుమార్ తదితరులు శ్రీలక్ష్మి భర్త శ్రీరంగస్వామి, కుమారుడు ఉషాకాంత్, కూతురు సంధ్య, తమ్ముడు శ్రీధర్‌తోపాటు శరీర దానానికి ముందుకు వచ్చిన వారిని అభినందించారు.

'స్వతంత్ర సేనానులుగా గుర్తించాలి'

హనుమకొండ చౌరస్తా, జూన్ 25 : దేశంలో ఎమర్జెన్సీ సమయంలో అరెస్టయిన తమను స్వతంత్ర సేనానులుగా గుర్తించాలని భారత్ సురక్ష సమితి అధ్యక్షుడు సీహెచ్ శాంప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆనాటి ఇందిర ప్రభుత్వం పైశాచికంగా, రాక్షసత్వంగా ప్రవర్తించిందన్నారు. ఎమర్జెన్సీని ఎత్తివేసిన రోజున లక్ష మందిపై అరెస్ట్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎమర్జెన్సీ విధించిన రోజును ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ దినంగా ప్రకటించాలని, అప్పటి ఉద్యమకారులకు స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న వారికి ఇస్తున్నట్లుగా కేంద్ర ప్రభుత్వం పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బూర రాంచందర్, కోటేశ్వర్‌రావు, జీ మనోహర్, మార్గం ఎల్లయ్య, ఎం అశోక్ రెడ్డి, ఎం నర్సింగరావు, సారయ్య, నాగభూషణం, చిలుకయ్య, మనోహర్, పీ కేశవరెడ్డి, నరెడ్ల భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- కలెక్టర్ ప్రావీణ్య
- రైతు భరోసాపై అభిప్రాయాల సేకరణ

పలివేల్పులలో మంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వ్యవసాయాధికారులు, రైతులు

పరకాల, జూన్ 25 : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. పట్టణంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించే రైతు భరోసా పథకానికి పలువురు రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతు భరోసా పథకంపై రైతులు అందించిన సూచనలు, సలహాలను రాష్ట్ర ప్రభుత్వానికి అందించనున్నట్లు తెలిపారు. కాగా, వ్యవసాయ అధికారుల సూచనల మేరకే రైతులు సాగు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పరకాలలో నిర్మిస్తున్న నాలాలను ఆమె పరిశీలించారు. పట్టణంలోని హుజూరాబాద్ రోడ్డులో బండ్ల బాట వద్ద డ్రైనేజీ నిర్మాణానికి సంబంధించిన సర్వే పనులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో నారాయణ, వ్యవసాయ శాఖ ఏడీఏ రవీందర్, తహసీల్దార్ వెంకట భాస్కర్, ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు, ఏవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ నర్సింహా పాల్గొన్నారు.

పలివేల్పులలో..

హసన్‌పర్తి : భీమారం పలివేల్పులలోని రైతు వేదికలో రైతు భరోసాపై మంగళవారం అభిప్రాయాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ నుంచి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వరి పంటపై ఆన్‌లైన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం నిర్వహించి, నేరుగా రైతుల అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో ఏడీ దామోదర్‌రెడ్డి, ఏవోలు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు. కాగా, గత వర్షాకాలంలో భారీగా కురిసిన వర్షాలకు తెగిన చెరువు కట్టలకు మరమ్మతు చేయించాలని స్థానిక రైతు చేపూరి సాంబయ్య కోరారు. చెరువు కట్టలు తెగి ఏడాది గడుస్తోందని, దీంతో చెరువు పారకం ఉన్న పొలాలు రెండు పంటలు పండలేదని తెలిపారు. ఇప్పుడైనా కట్టలకు మరమ్మతు చేసి రైతులును ఆదుకోవాలని కోరారు.

రోహిణి కార్తె వరకే పెట్టుబడి ఇవ్వాలి

ప్రభుత్వం రైతులకు రోహిణి కార్తె వరకే పెట్టుబడిసాయం అందజేస్తే ముందుగానే ఎరువులు, విత్తనాలు, పనిముట్లు తెచ్చుకుంటం. అట్లయితే ఎలాంటి ఇబ్బందులు ఉండదు. పెట్టుబడి కోసం అప్పులు తెచ్చి ఇబ్బందులు పడుతున్నాం. కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం వేరుగా ఇవ్వాలి. భూమి ఉన్నవారికి కూడా ఇవ్వాలి. లేకపోతే కౌలు రైతులకు వారు భూములు ఇవ్వరు. భూములు పడావుగా మారే అవకాశం ఉంది.

- చెన్నపురెడ్డి బుచ్చిరెడ్డి, దేవన్నపేట

ప్రతివారం అవగాహన కల్పించాలి

ఈ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలి. గత ప్రభుత్వం రైతులకు సరైన సమయంలో పెట్టుబడి సాయం ఇచ్చి ఆదుకుంది. కాంగ్రెస్ కూడా ముందుగానే పెట్టుబడి సాయం ఇవ్వాలి. ప్రతి వారం రైతు వేదికలో అవగాహన కల్పించాలి. రైతులకు పరదాలు, వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులు సబ్సిడీలో ఇవ్వాలి. ప్రభుత్వం సకాలంలో పెట్టుబడి సాయం ఇస్తే అప్పులు తేవాల్సిన అవసరం ఉండదు.

- గోగుల శ్రీనివాస్‌రెడ్డి, బైరాన్‌పల్లి

బ్యాడ్మింటన్‌లో ఎల్బీ విద్యార్థినికి గోల్డ్‌మెడల్

సుకృతిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

హనుమకొండ చౌరస్తా, జూన్ 25 : లాల్‌బహదూర్ కాలేజీలో ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న సుకృతి కిట్స్ కాలేజీలో జరిగిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని మహిళల సింగిల్స్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ తెలిపారు. అలాగే అండర్-19 బాలికల సింగిల్స్ విభాగంలో మరో గోల్డ్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సుకృతిని ప్రిన్సిపాల్‌తోపాటు ఫిజికల్ డైరెక్టర్ బీ ప్రభాకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే రాజేందర్‌రెడ్డి, కాలేజీ సెక్రటరీ కం కరస్పాండెంట్ ఈ రాజేందర్, చైర్మన్ నిరంజన్, గేమ్స్ కమిటీ సభ్యులు రాజేశ్వరరావు, శృతి, రజిని, సునీత అభినందించారు.

కిట్స్‌లో ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్

హసన్‌పర్తి, జూన్ 25 : ఎర్రగట్టు సమీపంలోని కిట్స్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు మంగళవారంతో ముగిసినట్లు బ్యాట్ వైస్ ప్రెసిడెంట్, డబ్ల్యూడీబీఏ జనరల్ సెక్రటరీ కిట్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పింగళి రమేశ్‌రెడ్డి తెలిపారు. ముగింపు కార్యక్రమానికి వరంగల్ క్లబ్ కార్యదర్శి ఎం రవీందర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ, బ్యాట్ సెక్రటరీ జితేందర్‌రెడ్డి హాజరై విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డబ్ల్యూడీబీఏ కోశాధికారి నాగకిషన్, సభ్యులు మోహన్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్, కిట్స్ అసోసియేట్ ప్రొఫెసర్ ప్రభాకరాచారి పాల్గొన్నారు.

సహకార సంఘాల సిబ్బందికి ఏకరీతి వేతన పాలసీ

సుబేదారి,జూన్ 25 : సహకార సంఘాల సిబ్బందికి ఏకరీతి హెచ్‌ఆర్ పాలసీకి చర్యలు తీసుకుంటామని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు తెలిపారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బ్యాంకు జిల్లా ఎంపవర్డ్ కమిటీ సమావేశం నిర్వహించారు. బ్యాంకు డైరెక్టర్ జగన్‌మోహన్‌రావు, వరంగల్, హనుమకొండ, జనగామ, భూపాలపల్లి జిల్లాల డీసీవోలు సంజీవరెడ్డి, నాగేశ్వర్‌రావు, రాజేందర్‌రెడ్డి, శైలజ, బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్, జనరల్ మేనేజర్ శ్రీధర్, డీజీఎం అశోక్ పాల్గొన్నారు.

శానిటేషన్ పనుల టెండర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పరకాల, జూన్ 25 : మండలంలోని మల్లక్కపేట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2024-25 సంవత్సరానికిగాను శానిటేషన్ పనుల టెండర్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు. పాఠశాల ఆవరణలో స్వీపింగ్/శానిటేషన్ చేసేందుకు ఆసక్తి ఉన్న వారు రూ.వెయ్యి డీడీ చెల్లించి బుధవారం నుంచి టెండర్ దరఖాస్తు ఫారాలు పొందవచ్చన్నారు. ఈ నెల 28 మధ్యాహ్నం 12 గంటలలోపు సీల్డ్ టెండర్లు వేయాలని సూచించారు. అదేరోజు మధ్యాహ్నం టెండర్లు తెరిచి, అర్హులను ప్రకటించనున్నట్లు వివరించారు.

అంతర్జాతీయ చెస్ గ్రాండ్ మాస్టర్‌కు సన్మానం

అర్జున్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, జూన్ 25 : జిల్లాకు చెందిన అంతర్జాతీయ చెస్ గ్రాండ్ మాస్టర్ ఈ అర్జున్‌ను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ ప్రావీణ్య, గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ రాధికగుప్తా శాలువాతో సన్మానించి మెమెంటో అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ డాక్టర్ శ్రీనివాస్ రావు-జ్యోతిల తనయుడు అర్జున్ గరిష్ఠంగా 2778 రేటింగ్‌ను సాధించి, ప్రపంచంలోనే టాప్ 4లోకి ప్రవేశించడం అభినందనీయమన్నారు. అతడు హనుమకొండ జిల్లాకు చెందిన క్రీడాకారుడు కావడం చాలా గర్వంగా ఉందన్నారు. క్రీడాకారులను ఆదుకుంటామని, వారికి అండగా నిలుస్తామని తెలిపారు.

మహిళా, శిశు సంక్షేమంపై దృష్టి సారించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

హనుమకొండ, జూన్ 25 : మహిళాభివృద్ధి, శిశు సంక్షేమంపై దృష్టి సారించాలని రాష్ట్ర ఆ శాఖ కమిషనర్, సెక్రటరీ వాకాటి కరుణ అన్నారు. మంగళవారం జిల్లాల కలెక్టర్లు, జిల్లా సంక్షేమ అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో హనుమకొండ జిల్లా నుంచి కలెక్టర్ పీ ప్రావీణ్య పాల్గొని మాట్లాడుతూ మహిళాభివృద్ధి శిశు సంక్షేమంతో పాటు దివ్యాంగులవయో వృద్ధుల సంక్షేమం కోసం ఆయా విభాగాల సమన్వయంతో పని చేయాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. అన్ని విభాగాలకు సంబంధించిన పూర్తి నివేదికలను శనివారం వరకు అందచేస్తే సమన్వయ సమావేశంతో భవిష్యత్ కార్యాచరణ రూపొందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని విభాగాల వారితో కలిపి ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సత్వర చర్యలు తీసుకునేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లా సంక్షేమ అధికారి కే మధురిమ, సూపరింటెండెంట్ లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చర్యలేవి..?

- పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా ఫీజుల పెంపు
- కొరవడిన విద్యాశాఖాధికారి పర్యవేక్షణ
- నేడు స్కూల్స్ బంద్.. ఫోన్లకు మెసేజ్‌లు

హనుమకొండ చౌరస్తా, జూన్ 25 : జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో నర్సరీ నుంచి పదో తరగతి వరకు రూ.వేలు, లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. పుస్తకాలు, యూనిఫామ్స్ పేరిట భారీగా దోపిడీ చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రైవేట్ విద్యాసంస్థలు పాటించాల్సిన నిబంధనలను విద్యాశాఖాధికారి గాలికి వదిలేస్తున్నారు. ఏ ఒక్క పాఠశాలనైనా సందర్శించడం కానీ, నోటీసులు ఇచ్చిన దాఖలాలేవని, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఇచ్చే మామూళ్లతో మమ అనిపిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఏ ఒక్క ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అగ్నిప్రమాద నివారణ చర్యలు చేపట్టడం లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తూ ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్స్ అమ్ముతున్నా అటువైపు కన్నెత్తి చూడటం లేదని మండిపడుతున్నారు. కాగా, బడులు తెరిచి 15 రోజులు కావస్తున్నా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేయలేదు. అలాగే, పాఠ్యపుస్తకాలు కూడా అందజేయలేదు. చాలా పాఠశాలల్లో మౌలిక వసతులు కరువయ్యాయి.

నేడు స్కూల్స్ బంద్

అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) బుధవారం పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చింది. జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతుల కల్పనతోపాటు ప్రైవేట్ స్కూళ్లు వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ జిల్లావ్యాప్తంగా స్కూళ్ల బంద్ నిర్వహించనున్నారు. దీంతో ప్రైవేటు విద్యాసంస్థలు ముందు జాగ్రత్తగా సెలవు ఇచ్చేస్తున్నాయి. స్కూల్‌కు సెలవు అంటూ తల్లిదండ్రుల ఫోన్లకు మెసేజ్‌లు పంపుతున్నాయి.

'ఎమ్మార్సీ భవనాన్ని తిరిగి కేటాయించాలి'

దామెర, జూన్ 25 : మండల కేంద్రంలో నిర్మించిన ఎమ్మార్సీ భవనాన్ని వెంటనే ఖాళీ చేసి, తిరిగి తమకు అప్పగించాలని ఎంఈవో రమాదేవి కోరారు. మంగళవారం ఎంపీడీవో కల్పన, ఎంపీపీ కాగితాల శంకర్‌కు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యాకార్యకలాపాల కోసం నిర్మించిన ఎమ్మార్సీ భవనంలో ప్రస్తుతం ఎంపీడీవో కార్యాలయం నడుస్తున్నదని, దాన్ని తిరిగి తమకు అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ, యూటీఎఫ్ నాయకులు భగవాన్‌రెడ్డి, సుదర్శన్, కళావతి, సీఆర్‌పీ నరేశ్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి మండల స్థాయి ఎంపిక

దామెర, జూన్ 25 : స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మంగళవారం మండల స్థాయి ఎంపికలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు నైపుణ్యత, ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించి, ఎంపిక చేసినట్లు ఎంఈవో రమాదేవి తెలిపారు. మండలస్థాయిలో ఎంపికైన వారు జిల్లా స్థాయిలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపీపీ కాగితాల శంకర్, నోడల్ అధికారి జుమ్మూ, ఎంపీడీవో కల్పన, ఎంపీవో రంగాచారి, ఇన్‌చార్జి హెచ్‌ఎం రుక్మిణిదేవి, పీఈటీలు దేవేందర్, రాజేశ్వర్, కమలాకర్ పాల్గొన్నారు.

పరకాలలో రేపు ఎంపిక

పరకాల : స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి గురువారం మండల స్థాయి ఎంపిక నిర్వహించనున్నట్లు ఎంఈవో ఎస్ రమాదేవి, మండల నోడల్ అధికారి నామాని సాంబయ్య తెలిపారు. 2024-25లో 4వ తరగతిలో ప్రవేశానికి 1-9-2015నుంచి 31-8-2016 మధ్య జన్మించిన బాలబాలికలు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత స్కూల్‌లో నిర్వహించనున్న ఎంపికకు స్టడీ, ఆధార్, బర్త్ సర్టిఫికెట్లతో ఉదయం 9గంటలకు హాజరు కావాలన్నారు.

శాయంపేటలో

శాయంపేట : స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం కోసం గురువారం ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో రమాదేవి తెలిపారు. విద్యార్థులు ఎంఆర్‌సీ భవనంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు శాయంపేట బాలికల ఉన్నత పాఠశాల పీడీ గీతను సంప్రదించాలని కోరారు.

ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి

హనుమకొండ చౌరస్తా, జూన్ 25 : రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ, డిప్లొమా ఇన్ ప్రీఎడ్యుకేషన్‌లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో డాక్టర్ ఎండీ అబ్దుల్ హై తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు అర్హత పరీక్షలో 50 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు 45 శాతం మార్కులు ఉండాలన్నారు. జూలై 10న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

అక్రమ లింగ నిర్ధారణ ముఠా అరెస్ట్

స్కానింగ్ మిషన్, బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం

నిందితుల అరెస్ట్ చూపిస్తున్న హనుమకొండ ఏసీపీ

సుబేదారి, జూన్ 25 : చట్ట వ్యతిరేకంగా లింగ నిర్ధారణకు పాల్పడుతున్న నలుగురి ముఠాను హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం హనుమకొండ పోలీసు స్టేషన్‌లో ఏసీపీ దేవేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. కాజీపేట కడిపికొండకు చెందిన ప్రధాన నిందితురాలు నర్సు బస్కె స్రవంతి, ములుగు జిల్లా పత్తిపల్లికి చెందిన కాసిరాజు దిలీప్, హనుమకొండ కుమార్‌పల్లికి చెందిన జంగా రాజమణి, వరంగల్ కాశీబుగ్గకు చెందిన ల్యాబ్ టెక్నిషియన్ ఏకుల నరేశ్ ముఠాగా ఏర్పడ్డారు. హనుమకొండలో రాహస్యంగా లింగనిర్ధారణ స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ ముఠా హనుమకొండ వేయిస్తంభాల గుడి సమీపంలోని ఓ బాధితురాలికి లింగ నిర్ధారణ పరీక్షలు చేసి, అమ్మాయిగా గుర్తించారు. గర్భస్రావం కోసం టాబ్లెట్ ఇచ్చారు. బాధితురాలు వారిచ్చిన టాబ్లెట్ వేసుకోవడంతో అనారోగ్యానికి గురైంది. స్థానిక దవాఖానలో చికిత్స చేసుకొని విషయాన్ని డాక్టర్‌కు చెప్పింది. సదరు డాక్టర్ డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. జిల్లా వైద్య అధికారుల ఫిర్యాదు మేరకు నలుగురు నిందితులను హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ముఠాలో ప్రధాన నిందితురాలిగా ఉన్న స్రవంతి గతంలో ఇలాగే గర్భ స్రావానికి పాల్పడడంతో ఆమెపై ఐదు కేసులు నమోదయ్యాయి. ఒక కేసులో జైలుకు కూడా వెళ్లి, వచ్చింది. అయినా పద్ధతి మార్చుకోకుండా మరోసారి పోలీసులకు చిక్కింది. కార్యక్రమంలో హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీశ్, సిబ్బంది పాల్గొన్నారు.

దామెర పెద్దగుట్టలో అస్థిపంజరం

మృతుడు మల్లయ్యగా గుర్తింపు

మల్లయ్య (ఫైల్)

దామెర, జూన్ 25 : మండల కేంద్రం సమీపంలోని దామెర పెద్ద గుట్ట మల్లన్నగుండ్లలో మంగళవారం అస్థిపంజరాన్ని పోలీసులు గుర్తించారు. ఎస్సై కొంక అశోక్ కథనం ప్రకారం.. దామెరకు చెందిన గొర్రెల కాపరి వంగ మల్లయ్య(70) భార్య చండమ్మతో గొడవపడి 2020 నవంబర్ నెల 20న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి అతడి ఆచూకీ తెలియరాలేదు. సోమవారం సాయంత్రం మల్లయ్య మనవడు వంగ కిరణ్ గొర్రెలను మేపడానికి దామెర గుట్టవైపు వెళ్లగా అక్కడ అస్థిపంజరం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా ప్రదేశానికి చేరుకుని ఆనవాళ్లను సేకరించారు. అక్కడ నలుపు గీతల స్వెటర్, లుంగి, చెప్పులు, దుస్తులను చూసి, అవి తమ తాత మల్లయ్యవిగా మనుమడు కిరణ్ గుర్తించాడు. భార్యతో గొడవపడిన మల్లయ్య గుట్టపైకి చేరుకుని అక్కడి నుంచి కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని, ఎవరికీ ఎలాంటి అనుమానం లేదని మృతుడి కొడుకు సంపత్ చెప్పగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏఏఐతో ఒప్పందం చేసుకుం